

బకాసురుని వధిస్తూ...

ఎండమబ్బుల పగటివేళ బంగారు కాంతుల కల్పవక్షం ఎక్కి ఊరేగిన స్వామి.. చల్లని రాత్రి సర్వభూపాల వాహనాధీశుడై మాడవీధుల్లో విహరించాడు. బకాసుర వధ అవతారంలో దేవేరులతో కలసి ఊరేగిన స్వామిని భక్తజనం కనులారా చూసి తరించారు.

- భక్తుల సంఖ్య 3 లక్షలు దాటొచ్చని అంచనా
- శనివారం నుంచే నిండిపోయిన గ్యాలరీలు
- టీటీడీ భారీ ఏర్పాట్లు
- తిరుపతి, తిరుమలలో పార్కింగ్‌కు ఏర్పాట్లు

నేడు గరుడసేవ

తిరుమల బ్రహ్మోత్సవాలలో అత్యంత కీలక ఘట్టం నేడు. అనేక ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో పాటూ స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే వేడుక గరుడోత్సవం. ఒకవైపు వెంకన్న వేడుకను కనులారా చూడాలని తండోపతండాలుగా వస్తున్న జనం.. మరోవైపు ఏ ఆటంకం లేకుండా వాహనసేవ జరగాలని కోరుకుంటున్న టీటీడీ.. ఎండతో మబ్బులు దోబూచులాడుతున్న వేళ గరుడోత్సవానికి సకల ఏర్పాట్లు పూర్తయ్యాయి.

తిరుపతి/తిరుమల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి గరుడసేవకు 3 లక్షల మంది భక్తులు తరలివస్తారని టీటీడీ అంచనా వేస్తోంది. ఇప్పటి దాకా గరిష్ఠంగా 2.60 లక్షల నుంచీ 2.70 లక్షల మంది వరకూ గరుడసేవకు హాజరు కాగా ఈసారి గరుడ సేవ ఆదివారం రావడం, ముందురోజు శనివారం కావడంతో ఈ సంఖ్య పెరగవచ్చని భావిస్తున్నారు. దానికనుగుణంగా టీటీడీ యంత్రాంగం భారీఏర్పాట్లు చేపట్టింది.

29 ఉదయం దాకా బైక్‌లకు అనుమతి లేదు!

శనివారం రాత్రి 9 గంటల నుంచీ సోమవారం ఉదయం 6 గంటల దాకా తిరుపతి నుంచీ తిరుమలకు ద్విచక్ర వాహనాలను అనుమతించడం లేదు.

కొండపై 4 వేల కార్లకే అనుమతి

తిరుమలలో పార్కింగ్ సమస్య కారణంగా గరిష్ఠంగా 4 వేల వాహనాలను మాత్రమే అనుమతించనున్నారు. 2023లో 3 వేల వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పించగా గతేడాది 3500 వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించారు. నేటి ఉదయం నుంచే ప్రైవేటు వాహనాలైన జీపులు,కార్లు వంటి వాటిని కొండపైకి అనుమతించే అవకాశం వుండదు. కేవలం వీఐపీలు ప్రయాణించే వాహనాలను మాత్రమే అనుమతించనున్నారు.తిరుమలలో 20చోట్ల వాహనాలపార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు.

తిరుపతిలో పార్కింగ్ ఇక్కడ

- కడప, శ్రీకాళహస్తి మార్గాల నుంచీ వచ్చే టూ వీలర్లు, ఫోర్ వీలర్లు ఇస్కాన్, నెహ్రూ మున్సిపల్ హైస్కూలు, భారతీయ విద్యా భవన్ గ్రౌండ్స్‌లో పార్క్ చేయడానికి ఏర్పాట్లు చేశారు.
- చిత్తూరు, పీలేరు మార్గాల నుంచీ వచ్చే టెంపో ట్రావెలర్ బస్సులు, టూరిస్టు బస్సులకు దేవలోక్ వద్ద పార్కింగ్ సదుపాయం కల్పించారు.
- మదనపల్లె, చిత్తూరుల వైపు నుంచీ వచ్చే ఫోర్ వీలర్లు, టూ వీలర్లకు భారతీయ విద్యా భవన్, నెహ్రూ మున్సిపల్ స్కూలు, ఇస్కాన్ గ్రౌండ్స్‌లో పార్కింగ్ సదుపాయం కల్పించారు. ఇవన్నీ నిండిపోతే చెర్లోపల్లి, వకుళమాత ఆలయాల వద్ద కూడా పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు.
- పుత్తూరు వైపు నుంచి వచ్చే వాహనాలకు మ్యాంగో మార్కెట్ ఆవరణలో పార్కింగ్ సౌకర్యం కల్పించారు.
- మదనపల్లె, పీలేరు మార్గాల నుంచీ వచ్చే ఆర్టీసీ బస్సులు కాలూరు క్రాస్, ఆర్సీపురం క్రాస్, తనపల్లి క్రాస్, గరుడ ఫ్లైఓవర్ మీదుగా బస్టాండుకు చేరుకోవాల్సి వుంటుంది.

కొండపైకి ఆర్టీసీ బస్సులోనే వెళ్లాలి

తిరుపతి నుంచి తిరుమలకు ఆదివారం ఉదయం నుంచీ సోమవారం ఉదయం దాకా కేవలం ఆర్టీసీ బస్సులకు మాత్రమే అనుమతి వుంటుంది. గరుడసేవకు 425 ఆర్టీసీ బస్సులు నడవనున్నాయి. శనివారం రాత్రి నుంచీ సోమవారం ఉదయం దాకా 3125 ట్రిప్పులు తిరగడం ద్వారా 2.30 లక్షల మంది భక్తులను చేరవేస్తాయని అంచనా. తిరుపతి రైల్వే స్టేషన్, ప్రధాన బస్టాండు, తిరుచానూరు, ఎమ్మార్‌పల్లి, జూపార్కు, మంగళం, రేణిగుంట రైల్వే స్టేషన్‌ల నుంచీ ఆర్టీసీ బస్సులు తిరుమలకు నడుస్తాయి.

శ్రీవారిమెట్టు దారిలో నడవచ్చు

గరుడసేవ కారణంగా భక్తుల రద్దీని తట్టుకునేందుకు శ్రీవారి మెట్టు మార్గాన్ని ఆదివారం ఉదయం నుంచీ సోమవారం ఉదయం దాకా 24 గంటలూ తెరిచివుంచాలని టీటీడీ నిర్ణయించింది. సాధారణంగా ఉదయం 6 గంటల నుంచీ సాయంత్రం 6 గంటల వరకూ మాత్రమే అనుమతి ఉంటుంది.

మాడవీధుల్లో కార్నర్ పాయింట్లు

మాడవీధుల్లో గ్యాలరీల సామర్థ్యం 1.90 లక్షల మంది. ఈసారి మాడవీధుల్లోని కార్నర్ పాయింట్లుగా అన్నదానం, మేదరమిట్ట, అనంతాళ్వార్ తోట, సుపథం తదితర నాలుగు చోట్ల క్యూలైన్లను అధికారులు పొడిగించారు. రద్దీ ఏర్పడితే ఈ పాయింట్ల వద్ద అరగంట పాటు దర్శనం పొడిగిస్తే దాదపుగా అందరికీ శ్రీవారి దర్శనం లభించినట్లు అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

నిరంతరాయంగా అన్నపానీయాలు

భక్తులు శనివారం రాత్రి నుంచే మాడవీధుల్లోని గ్యాలరీల్లో బైఠాయించారు. సోమవారం ఉదయం వరకూ మాడవీధుల్లోని 190 గ్యాలరీలలో అన్న పానీయాలు నిరంతరం సరఫరా చేసేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. సాంబారు అన్నం, పెరుగన్నం, ఉప్మా, సుండలు (ఉడికించిన శెనగలు), పాలు, మజ్జిగ, తాగునీటి బాటిళ్లు భక్తులకు అందజేయనుంది. గ్యాలరీలకు చేరువలోనే టాయిలెట్లు కూడా ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం వరకూ ఏకంగా నాలుగు లక్షల మందికి సరిపడా భోజన ఏర్పాట్లు జరుగుతున్నాయి. రోజువారీ తయారు చేసే 3 లక్షల లడ్డూలకు అదనంగా మరో లక్ష లడ్డూలు తయారు చేసి అందుబాటులో వుంచారు మరోవైపు కొండమీద తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రాన్ని కూడా 24 గంటలూ తెరిచి వుంచుతారు.


కల్యాణవేదిక వద్ద రోడ్డుపై పడుకుని ఉన్న భక్తులు

పెరిగిన భద్రత

గరుడోత్సవంలో పోలీసు సిబ్బంది : 4500

టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ సిబ్బంది: 1600

సీసీ కెమెరాలు: 3000



తిరుమల సిబ్బందికి వస్త్ర బహుమానం



తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్న అర్చకులు, వేదపారాయణదారులు, ఇతర సిబ్బంది, పోటు సిబ్బంది, వాహన బేరర్లు, కల్యాణకట్ట క్షురకులకు శనివారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు వస్త్రబహుమానం అందించారు. వైభోత్సవం మండపంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు చేతులు మీదుగా ఈ వస్త్రాలను అందజేశారు. ఆలయ పేష్కార్ రామకృష్ణ, పోటు పేష్కార్ మునిరత్నం ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): శ్రీవారిని శనివారం మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎన్ మంజుల, తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సినీనిర్మాత దిల్‌రాజు దర్శించుకున్నారు. వీరికి అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు.

సర్వభూపాల వాహనసేవలో జస్టిస్ గోపాలకృష్ణారావు



తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీ గోపాల కృష్ణారావు సర్వభూపాల వాహనసేవలో పాల్గొన్నారు. శనివారం రాత్రి జరిగిన వాహన సేవలో పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.


సమన్వయంతో సేవలు: జేఈవో

తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): గరుడసేవకు వచ్చే లక్షలాది మంది భక్తులకుమెరుగైన సేవలు అందించాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం కోరారు. ఆస్థానమండపంలో శనివారం ఆయన ఉద్యోగులు, శ్రీవారి సేవకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సమన్వయంతో గ్యాలరీలు, ఔట్‌సైడ్ క్యూలైన్లు, వైకుంఠం-2 క్యూలైన్లు, బయటప్రాంతాల్లోని భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ, బిస్కెట్లు తదితరాలు అందేలా చూసుకోవాలన్నారు. సమస్య తలెత్తితే తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సీవీఎస్వో మురళీకృష్ణ మాట్లాడుతూ.. వాహనసేవలు పూర్తయ్యా భక్తులను బయటకు పంపేందుకు ప్రతి వీధికి అధికారిని నియమించినట్టు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. జీఎన్సీ టోల్‌గేట్ వద్ద శనివారం ఉదయం ఓ వ్యక్తి బ్లేడ్‌తో గొంతు భాగంలో కోసుకున్నాడు. సిబ్బంది గుర్తించి వెంటనేఅశ్విని ఆస్పత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. పేరు చక్రధర్‌గా ప్రాథమికంగా తెలిసిందని భద్రతాసిబ్బంది పేర్కొన్నారు. పూర్తి వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఏపీసీసీఐఎఫ్ ఉపాధ్యక్షుడిగా కేవీ చౌదరి



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్(ఏపీసీసీఐఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిరుపతికి చెందిన కేవీ చౌదరి ఎంపికయ్యారు. శనివారం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్లో జరిగిన ఏపీసీసీఐఎఫ్ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర నేతలు ఈమేరకు ప్రకటించారు. ఈ సందర్భంగా కేవీ చౌదరి మాట్లాడుతూ వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పలువురు ప్రముఖులు ఆయన్ను అభినందించారు.



కళాకారులతో కలిసి ఉల్లాసంగా..



ఉల్లాసంగా ఈవో సింఘాల్

తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): ఉదయం కల్పవృక్షవాహనసేవలో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ పలు కళాబృందాలతో కలిసి డప్పులు కొడుతూ, నృత్యం చేస్తూ ఉత్సాహంగా ఉల్లాసంగా కనిపించారు. కొందరు కళాకారులతో కలిసి సంగీతానికి తగ్గట్టుగా నృత్యం చేశారు. మరోవైపు గ్యాలరీల్లోని భక్తులను పలకరించి అందుతున్న సౌకర్యాల తెలుసుకున్నారు. మధ్యలో శ్రీవారిసేవకులు, విజిలెన్స్, పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తూ సందడిగా కనిపించారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు కూడా కళాబృందాలతో కలిసి డప్పుకొట్టి, కత్తి చేతబట్టి ఉల్లాసంగా కనిపించారు.

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ, శిలాతోరణం, బాటగంగమ్మ సర్కిల్ మీదుగా ఆక్టోపస్ భవనం వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.2.58 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,358

తలనీలాలు సమర్పించినవారు: 29,166

మోహినీ అవతారం వెనుక కథ..

తిరుమల, సెప్టెంబరు27(ఆంధజ్యోతి): బ్రహ్మోత్సవంలో ఐదవ రోజున ఆదివారం ఉదయం మలయప్పస్వామి మోహినీ రూపం ధరించి దంతపల్లకీలో తిరువీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. తోడుగా శ్రీకృష్ణస్వామి మరో పల్లకీలో వేంచేస్తారు. దేవతలు, రాక్షసులు క్షీరసాగరాన్ని మధించినప్పుడు అమృతం ఉద్భవించింది. ఇరువర్గాలు పోటీపడుతూ మథనపడేవేళ దుష్టుల్ని శిక్షించడానికి, శిష్టుల్ని రక్షించడానికి సమ్మోహనమైన సుందరి ప్రత్యక్షమైంది. దేవతలకు అమృత పంపకం చేసిన జగన్మోహన రూపమే మోహినీ అవతారమని చెబుతారు. ఈ మోహినీ రూపంలో స్వామి ఆదివారం ఉదయం భక్తులకు కనిపిస్తారు. మలయప్ప సాధారణంగా నిలబడే భంగిమలో కాకుండా కూర్చుని కనిపించడం ఈ వాహనసేవలో ప్రత్యేకత. స్త్రీలు ధరించే అన్ని ఆభరణాలనూ స్వామికి అలంకరిస్తారు. కేశాలకిరీటం, పట్టుచీర, రత్న ఖచిత సూర్య, చంద్రసావేరి, నాసికకు వజ్రఖచితమైన ముక్కుపుడక, బులాకీ ఉంటాయి. శంకుచక్రాల స్థానంలో రెండు వికసించిన స్వర్ణకమలాలను ఏర్పాటుచేస్తారు. శ్రీవిల్లిపుత్తూరు నుంచి వచ్చిన పూలమాలు, చిలుకలను స్వామికి అలంకరిస్తారు.

వాహన సేవలో పుస్తకావిష్కరణలు



తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : శనివారం ఉదయం జరిగిన కల్పవృక్ష వాహన సేవలో మూడు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ ఛైర్మన్ బీఆర్‌నాయుడు ఆవిష్కరించారు. డాక్టర్ చిర్రావూరి శివరామకృష్ణశర్మ రచించిన వైదిక విజ్ఞానం, డాక్టర్ పులికొండ సుబ్బాచారి రచించిన జానపదుల ఆధ్యాత్మికత, ఆచార్య భోగరాజు పార్వతి ఇంగ్లీషు అనువాదం- ఆనంద నిలయం పుస్తకాలను ఆవిష్కరించారు.

దొంగతనాల కట్టడికి పోలీసుల ప్రణాళిక

తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): గరుడవాహనసేవలో భక్తులను దొంగలబారిని పడనీయకుండా పోలీసులు ప్రత్యేకంగా పోలీసు బృందాలను నియమించారు. వీరు సివిల్ డ్రెస్‌లో భక్తుల మధ్య ఉంటారు. భక్తుల్లానే ఉంటూ అనుమానితులపై కన్నువేస్తారు. తేడా వస్తే వెంటనే అదుపులోకి తీసుకుంటారు.

కోలుకుంటున్న కార్పొరేటర్ సంధ్య

తిరుపతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్పొరేటర్ డాక్టర్ అన్నా సంధ్య కోలుకుంటున్నారు. గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె భర్త డాక్టర్ వెంకట కిషోర్, కుమార్తె అశ్వనందన(4)లు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఇదే ప్రమాదంలో డాక్టర్ సంధ్య, ఆమె కుమారుడు ఆయుష్‌నందన్‌లు గాయపడి గుంటూరులోని ఆస్టర్ రమేష్ ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. ఆమె కాళ్లకు శస్త్ర చికిత్స చేశారు. బాలుడు ఆయుష్ నందన్ పొట్టభాగంలో చిన్నపాటి శస్త్రచికిత్స చేసినట్టు సమాచారం. తల్లీకుమారులిద్దరూ పదిరోజుల పాటు ఆస్పత్రిలో ఉండాల్సి ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు.


నారాయణీ అలంకరణలో చంద్రగిరి ఎల్లమ్మ


గాయత్రిదేవిగా మిట్టమీద గంగమ్మ


స్కంధమాతగా ఉగ్రప్రత్యంగిరాదేవి


విశేషాలంకరణలో సంతోషిమాత


మీనాక్షి అలంకారంలో మహాలక్ష్మి


లలితా త్రిపురసుందరీ దేవిగా చాముండేశ్వరి

నారాయణీ రక్షమాం..

చంద్రగిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి: దేవీనవరాత్రి మహోత్సవాలలో భాగంగా మూలస్థాన ఎల్లమ్మ ఆలయ శనివారం రాత్రి గరుడ వాహనంపై నారాయణీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, ఉభయదారులు పాల్గొన్నారు. మిట్టమీద గంగమ్మకు గాయత్రిదేవి అలంకరణలో అశ్వ వాహనంపై అధిష్ఠింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయం ఆవరణలోని సంతోషిమాత గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. తొండవాడ ఉగ్రప్రత్యంగిరాదేవి స్కందమాతగా దర్శనమిచ్చారు.

రామచంద్రాపురం: రాయలచెరువుకట్ట భవాని జలకంఠేశ్వరాలయంలో అమ్మవారు మీనాక్షి అలంకారంలో , శక్తి పీఠంలో మరకతశక్తి కాళీ అమ్మవారు ధూమ్రావతి దేవిగా, పారకాల్వ రాజరాజేశ్వరి పీఠం అమ్మవారు మీనాక్షిగా భక్తులను కటాక్షించారు.

తిరుపతి రూరల్: తుమ్మలగుంట ఎల్ఎస్‌నగర్‌లోని శక్తిచాముండేశ్వరీదేవి లలితా త్రిపురసుందరిదేవిగా, చెంచువారికాలనీలోని మూలస్థాన ఎల్లమ్మ లలితాత్రిపుర సుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



లలితా త్రిపుర సుందరిదేవి మూలస్థాన యల్లమ్మ

మానవత్వమే అభిమతం కావాలి

● జాషువా జయంతి సభలో సుజనా చౌదరి



జాషువా చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగిస్తున్న సుజనా చౌదరి,భానుప్రకాష్ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సూర్య చంద్రులున్నంతవరకూ కుల మతాలు ఉంటాయని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో శనివారం గుర్రం జాషువా జయంతి సభలో ఆయన ప్రసంగించారు. కుల మత ప్రభావాలు పోకున్నా అందరూ మానవత్వంతో మెలగాలన్నారు. జాషువా దేశ సౌభాగ్యం పట్ల తన సాహిత్యంలో ఎంతో గొప్పగా స్పందించారన్నారు. ఎస్వీయూ తెలుగు విశ్రాంతాచార్యులు గార్లపాటి దామోదర నాయుడు మాట్లాడుతూ.. దేశ ఔన్నత్యాన్ని పెంపొందించడానికి జాషువా సాహిత్యం తోడ్పడుతుందన్నారు.. పద్మావతి డిగ్రీ కాలేజీ తెలుగు విభాగాధిపతి డాక్టర్ కృష్ణవేణి, అవధాని ఉప్పలదడియం భరత్‌కుమార్ శర్మ, బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి నూకల మధుకర్, సంస్కృత యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి , టీటీడీ పాలకమండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, నాగోతు రమేష్ నాయుడులు మాట్లాడారు. సభకు ముందు జాషువా చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో బీజేపీ నాయకులు కోలా ఆనంద్, జల్లి మధుసూదన్, గుడిసె దేవానంద్, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, నాదముని తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదానసేవలో బిరుదాల హనుమంతరెడ్డి తదితరులు

తిరుపతి రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం తుమ్మలగుంట ఎల్ఎస్‌నగర్ లోని శక్తిచాముండేశ్వరీదేవి ఆలయం వద్ద భక్తులకు పెద్దఎత్తున్న అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కరాంచ్ జన్మదినం కూడా కావడంతో కుటుంబసభ్యులు, ధ్యానసాయి ఏజన్సీ అధినేత బిరుదాల హనుమంతరెడ్డి, సాయిరాంరెడ్డి పాల్గొని అన్నదాన సేవ నిర్వహించారు.

కల్పవృక్షవాహనంపై కల్యాణ వెంకన్న

తిరుపతిరూరల్, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాజమన్నార్ అలంకారంలో కల్పవృక్షవాహనంపై, రాత్రి సర్వభూపాల వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. ఆదివారం రాత్రి జరిగే గరుడోత్సవసేవ నిర్వహణ, ఏర్పాట్లపై తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమావేశం నిర్వహించారు.

పాడిపరిశ్రమలో ఉద్యోగావకాశాలు మెండు

తిరుపతిరూరల్, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): డెయిరీ టెక్నాలజీ కోర్సు విద్యార్థులకు పాడి పరిశ్రమలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని పలువురు పూర్వవిద్యార్థులు పేర్కొన్నారు. ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని డెయిరీటెక్నాలజీ కళాశాలలో 2025-26లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు దీక్షారంభం పేరిట 15రోజుల ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం పూర్వవిద్యార్థులతో ఆన్‌లైన్‌లో పరస్పర పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీన్ ప్రొఫెసర్ కె.నాగేశ్వరరావు, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ గంగరాజు, ఓఎస్‌ఏ డాక్టర్ జీఎస్ స్ఫూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లా కాలేజీ గ్రాడ్యుయేషన్ డే



హాజరైన న్యాయమూర్తులు గురునాథ్, రాంగోపాల్, కళాశాల ఛైర్మన్ రవి

తిరుపతిరూరల్, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): కేశవాయనగుంటలోని అనంత న్యాయ కళాశాల గ్రాడ్యుయేషన్‌డేని శనివారం ఘనంగా నిర్వహించారు. మూడవఅదనపు జిల్లా కోర్టు జడ్జి ఎం.గురునాథ్, ఐదవ అదనపు జిల్లాకోర్టు జడ్జి జి.రాంగోపాల్‌లత కలిసి కళాశాల ఛైర్మన్ అనంతరవి విద్యార్థులకు డిగ్రీలు అందజేశారు. మెరిట్ విద్యార్థులకు అనంత రాజమ్మ మెమోరియల్ బంగారు, వెండి పతకాలను అందించి అభినందించారు. ప్రిన్సిపాల్ సిరికుమార్, వైస్ ప్రిన్సిపాల్ శారద, ఏవో శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి



ఆలయ ఆవరణలో దీపారాధన చేస్తున్న మహిళలు

చంద్రగిరి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించాక ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం చేశారు. పెరటాసి నెల రెండవ శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు దీపారాధన చేశారు.సాయంత్రం ఉత్సవర్లను మాడ వీధుల్లో ఊరేగించారు.

శిల్పారామంలో దసరా సంబరాల ప్రారంభం



తిరుచానూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి)శిల్పారామంలో శనివారం దసరా సంబరాలను నిర్వహించారు. తొలిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నందనపల్లికి చెందిన శివాలయ నాట్యశాలకు చెందిన కళాకారులు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. జిల్లా పార్యటక శాఖ, సాంస్కృతిక శాఖ అధికారి జనార్దన్‌రెడ్డి ప్రశంసాపత్రాలు అందజేశారు. శిల్పారామం ఏవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సదరం డిస్కం ఫైనాన్స్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు



రామ్మోహనరావు

తిరుపతి(ఆటోనగర్),సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం ఫైనాన్స్ డైరెక్టర్‌గా రామ్మోహనరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు శనివారం సంస్థ సీఎండీ కె.సంతోషరావు ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఆయన చీఫ్ జనరల్ మేనేజరుగా పనిచేస్తున్నారు. రెగ్యులర్ డైరెక్టర్‌ను నియమించేవరకూ రామ్మోహనరావు కొనసాగుతారు.

వడ్డీ వ్యాపారి దౌర్జన్యం

వృద్ధురాలు ఇంటికి తాళం ● మూడు రోజులుగా ఇంటిబయటే

నాగలాపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అప్పు చెల్లించలేదని నాగలాపురంలో వడ్డీ వ్యాపారి వృద్ధురాలిపై దౌర్జన్యానికి దిగాడు. ఆమెను ఇంటినుంచి గెంటేసి ఇంటికి తాళం వేశాడు. మూడు రోజుల క్రితం చోటు చేసుకున్న ఈ ఘటన శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితురాలి కథనం మేరకు.. నాగలాపురం గాంధీ వీధికి చెందిన సయ్యద్‌బాబు భార్య జైనాబీ పట్టణానికి చెందిన వడ్డీ వ్యాపారి జగదీష్ వద్ద వడ్డీకి అప్పు తీసుకుంది. బాండు పత్రాలు రాసి ఇచ్చింది. తర్వాత కంతులవారీగా అప్పు చెల్లించింది. అనంతరం బాండు పత్రాలు ఇవ్వాలని కోరగా ఇంకా అప్పు తీరలేదని దౌర్జన్యం చేశాడు. ఇంటి నుంచి ఆమెను గెంటేసి తాళం వేశాడు. విద్యుత్ కనెక్షన్‌ను కట్ చేశాడు. అప్పు కింద ఇల్లు జమ చేసుకుంటున్నానని, ఇక్కడే ఉంటే మనుషులతో కొట్టి చంపేస్తానని, ఇల్లు నుంచి వెళ్లాలంటూ జగదీష్ బెదిరించాడు. ఇంటికి తాళం వేయడంతో మూడు రోజులుగా ఇంటిబయటే గడుపుతున్నానని ఆమె కన్నీటి పర్యంతమైంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా దీనిపై ఎస్ఐని వివరణ కోరగా ఈ ఘటనపై విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు.

తిరుపతిలోనూ క్రౌడ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం జరిగే శ్రీవారి గరుడ సేవకు శనివారం రాత్రికే రద్దీ పెరిగింది. దీని ప్రభావం తిరుపతిలోనూ కనిపిస్తోంది. దీంతో నగరంలోనూ క్రౌడ్ మేనేజ్ సిస్టమ్ నిర్వహిస్తున్నారు. శనివారం నాటికే తిరుపతి ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్, భారతి బస్టాండు, అన్ని రోడ్లలో భక్తులు కిక్కిరిశారు. తమిళనాడు నుంచి స్వామి మాల ధరించిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. దీంతో ఎస్పీ సుబ్బరాయుడు ముందస్తుగా ట్రాఫిక్ నియంత్రణతో పాటు క్రౌడ్ మేనేజ్‌మెంటు కోసం భారీ ఎత్తున పోలీసులను నియమించారు. ఇందులో భాగంగా భక్తులకు, వాహనదారులకు అవసరమైన సలహాలు, సూచనలను ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేంద్ర మైకు అందిస్తూ వచ్చారు. ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఫ్లైఓవర్ డౌన్ రోడ్డుతో పాటు భక్తులు అధిక సంఖ్యలో తిరుమలకు వెళ్లే రోడ్లపై పోలీసులు మోహరించారు.

తిరుపతి



లలితా త్రిపుర సుందరీ దేవీగా తాతయ్యగుంట గంగమ్మ


లలితా త్రిపుర సుందరీదేవిగా తాతయ్యగుంట గంగమ్మ


అన్నపూర్ణాదేవిగా వేశాలమ్మ


లలితా త్రిపురసుందరీ దేవిగా నడివీధి గంగమ్మ


అభిరామిదేవిగా బొంతాలమ్మ


అభిరామిదేవిగా అన్నపూర్ణదేవి


పద్మావతి సమేత వేంకటేశ్వరుడిగా వాసవీకన్యకాపరమేశ్వరి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి మూలమూర్తికి, ఉత్సవమూర్తికి లలితా త్రిపుర సుందరీదేవి అలంకారం చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పల్లివీధిలోని వేశాలమ్మ అన్నపూర్ణాదేవిగా, గాంధీ విగ్రహం సమీపంలోని పెద్దగంగమ్మ అన్నపూర్ణాదేవిగా, పాత మున్సిపల్ ఆఫీసు వద్ద నడివీధి గంగమ్మ.. లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కపిలేశ్వరస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. ● తిరుపతి(జీవకోన): బొంతాలమ్మ అభిరామిదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ● తిరుపతి అర్బన్: లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి ఆలయంలో అమ్మవారు అభిరామిదేవిగా, కొత్తవీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో మూలమూర్తి పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామిగా, ఉత్సవమూర్తి కామాక్షి అలంకరణలో దర్శనమిచ్చారు.

ఇంటిపై దాడులు

● పోలీసులకు పిర్యాదు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగర శివార్లలోని సప్తగిరి కాలనీ పంచాయతీ పరిధిలోని 12/287నెంబరు ఇంటిపై కొంత మంది దాడులు చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. కూలి పనిచేసుకోవడానికి నగరానికి వచ్చిన ఆ ఇంట్లో నివాసముండే ఫక్రుమ మొహిద్దీన్ మధ్యాహ్నం తిరిగి వచ్చేటప్పటికి ఇళ్లు ధ్వంసమైయుంది. వెంటనే ఆమె పోలీసులకు సమాచారమివ్వగా, వారు అక్కడకు వచ్చి విచారించారు. తాను నివాసముంటున్న ఇంటికి కొంతకాలంగా ఇదే గ్రామానికి చెందిన చిట్టెమ్మ తప్పుడు పత్రాలు సృష్టించి, ఈ ఇల్లు నాదే నని.. ఖాళీ చేయమని దౌర్జన్యం చేస్తోందని, అనుచరులతో కలసి ఈ దారుణానికి దిగారని ఫక్రుమ మొహిద్దీన్ ఫిర్యాదుచేశారు. వారి బెదిరింపులను భరించలేక కోర్టును ఆశ్రయించానని, విచారణ జరుగుతోందని, అయినా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. వారి నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించి, న్యాయం చేయాలని ఆమె పోలీసులను వేడుకున్నారు.


దాడికి గురైన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

అన్నా సంధ్యకు ఎమ్మెల్యే ఆరణి పరామర్శ

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న తిరుపతి కార్పొరేటర్ అన్నా సంధ్యను శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్‌ను వివరణ కోరగా, కోలుకుంటున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా బోరున విలపిస్తున్న అన్నా రామచంద్రయ్య దంపతులను ఓదార్చారు. ఎమ్మెల్యేతోపాటు జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి ఉన్నారు.


సంధ్య ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆరణి

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించండి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ సర్కిల్, తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఆదివారం వినియోగ బిల్లులను చెల్లించవచ్చని తిరుపతి టౌన్ ఈఈ గంగాధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ బిల్లులో వున్న క్యూఆర్‌కోడ్ ద్వారా కూడా బిల్లులు చెల్లించుకోవచ్చని ఈఈ కోరారు.

రేపు మెగా డీఎస్సీ విజేతలకు సన్మానం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని కచ్చపి ఆడిటోరియంలో సోమవారం మెగా డీఎస్సీ విజేతలను సన్మానిస్తున్నట్లు నారాయణ డీఎస్సీ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు తెలిపారు. వడ్ల జగదీష్, రఘునాథ్‌సింగ్, సతీష్ శనివారం మీడియా సమావేశంలో తెలిపారు.

14 వరకు ఆందోళనలు... ఆపై సమ్మె

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జేఏసీ నాయకుల పిలుపు మేరకు తిరుపతి సర్కిల్ జేఏసీ నాయకులు శనివారం సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావుకు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు దేవేంద్రరెడ్డి, ఎల్.చలపతి, మురళీధర్‌లు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యం అంగీకరించిన సమస్యలు, ప్రస్తుతం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఫలితంగా ఈ నెలలో వారం రోజులు ఆందోళనలు చేశామన్నారు. రెండవ దశ ఆందోళనలో భాగంగా అక్టోబరు 6నుంచి 14వరకు దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తామని, ఆపై నిరవధిక సమ్మె చేయడానికి రాష్ట్ర జేఏసీ నిర్ణయించిందని సీఎండీకి వివరించారు. కార్యక్రమంలో నాయకులు వి.గోపి, జి.ఏలుమలై, ఐ.సుబ్రమణ్యం, పి.షణ్ముగం, ఎ.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు 7లోపు దరఖాస్తు చేసుకోవాలి

తిరుపతి(విద్య), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): 2026-27 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతులకు నిర్వహించే నవోదయ ప్రవేశ పరీక్షకు అక్టోబరు 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని విశ్వం విద్యా సంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.ఎన్.విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో నవోదయ, సైనిక్ తదితర పోటీ పరీక్షలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గడువులోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పరీక్షలకు సంబంధించి మరిన్ని వివరాల కొరకు 86888 88802/93999 76999 నెంబర్లలోను లేదా వరదరాజనగర్‌లోని విశ్వం శిక్షణా సంస్థలో సంప్రదించాలని ఆయన కోరారు.





15న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ క్విజ్ పోటీలు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా అక్టోబరు 15న ఆన్‌లైన్‌లో వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ క్విజ్‌పోటీలు జరుపుతామని సెట్విన్ సీఈవో డాక్టర్ పి.యశ్వంత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన యువతీ యువకులు న్యూఢిల్లీలో జనవరి 12న నిర్వహించే యువజనోత్సవాల్లో పాల్గొనే అవకాశముంటుందన్నారు. ప్రధాని, కేంద్ర మంత్రులు, సీనియర్ అధికారులు, ఇతర నాయకుల సమక్షంలో ప్రత్యక్షంగా తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఆసక్తిగల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 98499 13063 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.





మధ్యప్రదేశ్ డిప్యూటీ సీఎంకు స్వాగతం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ ఉపముఖ్యమంత్రి రాజేంద్రశుక్లాకు స్థానిక బీజేపీ యువమోర్చా నాయకులు తిరుపతి విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనార్థం ఆయన శనివారం తిరుపతికి వచ్చారు. ఈ క్రమంలో యువమోర్చా నాయకులు పృథ్వీరెడ్డి, వంశీ, జీవన్, ఈశ్వర్ తదితరులు ఆయన్ను ఆహ్వానించిన వారిలో ఉన్నారు.




శోభాయమానం స్నపన తిరుమజనం



తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): శనివారం మధ్యాహ్నం రంగనాయక మండపంలో శ్రీవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమజనం శోభాయమానంగా నిర్వహించారు. బాదం, పిస్తా, వట్టివేరు, పసుపు కొమ్ములు, ఎండుద్రాక్షా, యాలకులు, తులసి, రోజామాలలతో పాటు ఈసారి ప్రత్యేకంగా కుంకుమ పువ్వు మాలలు, కిరీటాలతో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని అలంకరించారు.

కాశ్మీర్ కుంకుమపువ్వుతో మాలలు

కాశ్మీర్ నుంచి తీసుకువచ్చిన మూడు కేజీల కుంకుమ పువ్వుతో చెన్నైకు చెందిన నిపుణులు మాలలు, కిరీటాలు తయారు చేశారు. వీటి విలువ రూ.6 లక్షలు. అలాగే కురువేరు, తామరపువ్వులతో తయారు చేసిన మాలలుప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చెన్నైకు చెందిన రాజేంద్రన్, షణ్ముక సుందరం, బాలసుబ్రహ్మణ్యం గత కొన్నేళ్లుగా ప్రతి స్నపన తిరుమంజనం రోజున ఎనిమిది సెట్ల మాలలు, కిరీటాలను అందస్తున్నారని గార్డెన్ సూపరిటెండెంట్ శ్రీనివాసులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. రంగనాయక మండపాన్ని కూడా పలు రకాల పండ్లు, పుష్పాలతో అలంకరించారు. ఇందులో 25 వేల తామరపువ్వులు, 5 వేల కట్ రోజా పువ్వులు ఉన్నాయి.



చిత్రం: జి.గాయత్రీదేవి

దేవదేవుడినే పతిగా చేసుకున్న

గోదాదేవి

సేవింతురే!

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రతి ఉదయం సుప్రభాతంతో మేల్కొలిపితే, ధనుర్మాసంలో మాత్రం తిరుప్పావై పఠించి అర్చిస్తారు. ముప్పయి పాశురాల తిరుప్పావై మూలద్రావిడంలో గోదాదేవి గానం చేసిన గీతాలు. శ్రీరంగంలోని పూలతోటలో విష్ణుచిత్తులకు లభించిన కుమార్తె గోదాదేవి. రోజూ పూలు కోసి మాలఅల్లి శ్రీరంగనాథుడికి ఈమె వేసేది. ఆ మాలను ముందుగా తన మెడలో ధరించి బావుందని సంతృప్తి పడిన తర్వాతే స్వామికి అలంకరించేది. ఇది అపచారమని విష్ణుచిత్తుడు భావించినా స్వామి మాత్రం ఆమె మాలతో పాటూ గోదాదేవినీ స్వీకరించాడని చెబుతారు. అందుకే గోదాదేవి పుట్టిన శ్రీవిల్లి పుత్తూరులో ఆండాళ్ అలంకరించుకున్న పూల మాలను ఏటా తిరుమలకు తీసుకువచ్చి శ్రీనివాసుడికి అలంకరిస్తారు. దేవదేవుడినే పతిగా భావించిన మహా భక్తురాలిగా గోదాదేవిని కొలుస్తారు.

కలియుగ వెంకటేశ్వరుని వాహన సేవల్లో కళా బృందాల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. శనివారంనాటి కల్పవృక్ష వాహన సేవలో కళాకారుల ప్రదర్శనలు అద్భుతంగా సాగాయి. మహారాష్ట్రకు చెందిన 111 మంది కళాకారుల డ్రమ్ము విన్యాసాలు కట్టిపడేశాయి. తెలంగాణా కళాకారుల జానపద నృత్యం, కోయ నృత్యం, ఒడిస్సా కళాకారుల దల్కాయ్, జానపద నృత్యం, గుజరాత్ కళాకారుల దాకలదుడియ, రాజస్థాన్ కళాకారుల దాండియా, ఉత్తరాఖండ్ కళాకారుల చోలియా వంటి ప్రదర్శనలు భక్తజనరంజకంగా నిలిచాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కూచిపూడి, దశావతరాలు, చెక్కభజన, డప్పు నృత్యం, కోలాటం ఆకట్టుకున్నాయి. రాత్రి సర్వభూపాల వాహనసేవలోనూ సాంస్కృతిక ప్రదర్శనలతో భక్తులు పరవశించిపోయారు.

- తిరుమల(కల్చరల్), ఆంధ్రజ్యోతి)

సాంస్కృతిక వైభవం



ఎటు చూసినా భక్తజనమే



ఆక్టోపస్ వద్ద సర్వదర్శన భక్తుల రద్దీ

● ముందురోజే గరుడోత్సవ రద్దీ

తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. గరుడ వాహనం ముందు రోజే రద్దీగా మారింది. పెరటాసి మాసం రెండో శనివారం కూడా తోడవ్వడంతో భక్తసంద్రంగా దర్శనమిస్తోంది. మధ్యాహ్నానికే మాడవీధుల గ్యాలరీలన్నీ నిండిపోయాయి. మూలవిరాట్టు దర్శనానికి వెళ్లాలంటే 3 కిలోమీటర్ల క్యూలైన్ కనిపిస్తోంది. మరోపక్క వాహనాల ఆంక్షలు అమలవుతున్నాయి. రింగురోడ్డు వరకే అనుమతిస్తున్నారు. ప్రతి వాహనాన్ని పార్కింగ్‌కు తరలిస్తున్నారు. ఆదివారం విధులు నిర్వహించాల్సిన సిబ్బందిని శనివారం రాత్రి నుంచే తీసుకున్నారు. ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ శనివారం రాత్రి తనిఖీలు చేపట్టి విధుల్లోని భద్రతాధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు.



ఆక్టోపస్ భవనం సర్కిల్ నుంచి భక్తులను పీఏసీ5కి తరలింపు

వెంకన్న భక్తులకు వృక్షప్రసాదం



బ్రహ్మోత్సవాల్లో భక్తులకు 'వృక్షప్రసాదం' పేరుతో తులసి మొక్కలను టీటీడీ ఫారెస్టు విభాగం పంపిణీ చేస్తోంది. తమిళనాడులోని తిరుచ్చారాపల్లికి చెందిన తులసిట్రస్టు టీటీడీకి 2.50 లక్షల తులసి మొక్కలను విరాళంగా అందజేసింది. శ్రీవారి దర్శనం, వాహన దర్శనం పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణమయ్యేవారికి వీటిని రాంభగీచా, జీఎన్సీ, బాలాజీ బస్టాండ్, ఆక్టోపస్ భవనం సర్కిల్ ప్రాంతాల్లో అందజేస్తున్నారు. రోజుకు 25 వేల చొప్పున ఇప్పటికే 75 వేల మొక్కలను పంచారు.

తిరుమల చేరిన గోదాదేవి మాలలు





గరుడ సేవలో ఆదివారం శ్రీవారికి అలంకరించడానికి తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు నుంచి గోదాదేవి మాలలు తిరుమలకు చేరుకున్నాయి. బేడి ఆంజనేయ స్వామి ఆలయం వద్దగల పెద్దజీయర్ మఠంలో ఈ మాలలకు పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. తిరుమాడవీధులలో ఊరేగింపుగా శ్రీవారి ఆలయంలోకి తీసుకెళ్లారు. శ్రీవిల్లిపుత్తూరులో గోదాదేవికి ధరింపజేసిన మాలలను గరుడ సేవలో శ్రీవారికి అలంకరించడం ఆనవాయితీ. శ్రీవిల్లిపుత్తూరుకు చెందిన రెండు కుటుంబాల పూల తయారీదారులు ఈ మాలలు సమర్పిస్తున్నారు. తమిళనాడు దేవదాయశాఖ జాయింట్ సెక్రటరీ మారియప్పన్, ఈవో చక్కరై అమ్మాళ్, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, శ్రీవిల్లి పుత్తూరు ఆలయ స్థానాచార్యులు రమేష్ రంగరాజన్ పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

బ్రహ్మోత్సవాలలో నేడు	ఉదయం: 8-10మధ్య మోహినీ అవతారం రాత్రి: 6.30 నుంచి గరుడసేవ

ఐదు మున్సిపాల్టీలకు మార్గదర్శిగా కార్పొరేషన్

● స్వచ్ఛ సెహర్ జోడి ద్వారా ఒప్పదం



ఒప్పంద పత్రాలు చూపుతున్న పలు కార్పొరేషన్ల కమిషనర్లు

తిరుపతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఐదు మున్సిపాల్టీల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు తిరుపతి నగరపాలక సంస్థ మార్గదర్శకం వహించనుంది. ఈక్రమంలో శనివారం కుప్పం, మడకశిర, మైదుకూరు, కమలాపురం, జమ్మలమడుగు మున్సిపాలిటీలు 'స్వచ్ఛ సెహర్ జోడి' కింద నగరపాలక సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. చిన్న మున్సిపాలిటీల్లో పారిశుధ్యంలో మెరుగైన ఫలితాలు సాధించేలా సహకరిస్తామని కమిషనర్ మౌర్య చెప్పారు. 'స్వచ్ఛ సెహర్ జోడి' పథకం కింద అభివృద్ధి చెందిన నగరాలు మరి కొన్నింటిని అభివృద్ధి చేస్తాయన్నారు. తూకివాకం వద్ద చెత్త నిర్వహణ కేంద్రాన్ని కమిషనర్లు పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

నేడు తిరుమలకు నిమిషానికో బస్సు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ఆదివారం గరుడ సేవ సందర్భంగా నిమిషానికో బస్సు నడపనున్నట్లు ప్రజారవాణాధికారి జగదీష్ శనివారం తెలిపారు. చెన్నై, కాంచీపురం, తిరుత్తణి, వేలూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు రెండు రోజుల పాటు బస్సులు రద్దు చేశామన్నారు. ఎలక్ట్రిక్ సహా మొత్తం 425 బస్సులు.. తిరుపతి- తిరుమల మధ్య తిరుగుతాయన్నారు. 3,125ట్రిప్పులతో 2.3లక్షల మందికి ప్రయాణ ఏర్పాట్లు చేశామన్నారు. మామిడికాయల మార్కెట్, చెర్లోపల్లె సమీపంలోని హైవే, దేవలోక్, భారతీయ విద్యాభవన్, కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కాలేజీ గ్రౌండ్ ప్రాంతాల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఆదివారం సాయంత్రం 7గంటలకు తిరుమలలో రాంభగీచ బస్టాండు వద్ద వంద బస్సులు నిల్వ ఉంచుతామన్నారు.

ఐఐటీలో నిర్మాణాలకు రూ.1250 కోట్లు

● మొదటి విడత ఫేజ్ బీ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ



ఐఐటీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, కలెక్టర్ తదితరులు

ఏర్పేడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లో రూ.1250 కోట్లతో మొదటి విడత 'ఫేజ్ బీ' నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా 8 ఐఐటీలలో రూ.11 వేలతో చేపట్టే అభివృద్ధి పనులకు శనివారం ఒడిశాలోని జార్సిగూడ నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ పనులను నాలుగేళ్లలో పూర్తి చేయనున్నారు. తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ, ఇది భవనాల నిర్మాణమే కాదని, యువత ఉజ్వల భవిష్యత్తు నిర్మాణమన్నారు. మామిడి, టమోటా రైతులకు ఉపయోగపడేలా ఆహార ప్రాసెస్‌రంగంపైనా ఐఐటీ దృష్టి సారించడం వ్యవసాయ రంగానికి శుభపరిణామమన్నారు. ఈ ఫేజ్ బీలో మూడు అకాడమిక్స్ బ్లాక్స్, ఒక మెగా ఇండోర్ ఆడిటోరియం, ఒక ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం, రెసిడెన్షియల్, స్పోర్ట్స్ విభాగ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. ఇవి విద్యార్థులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, పరిశోధనలకు ఎంతో ఉపయోగంగా ఉంటాయని చెప్పారు. డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ నాయకత్వంలో సమాజానికి ఈ ఐఐటీ పెద్ద ముందడుగు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీడబ్ల్యూడీ ప్రాజెక్టు ఇన్‌ఛార్జి, చీఫ్ ఇంజనీర్ కం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీఎస్ రెడ్డి, ఇన్‌ఛార్జి డైరెక్టర్ మురళీకృష్ణ, రిజిస్టార్ కృష్ణమోహన్, డీన్లు, ఫ్యాకల్టీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'పర్యాటకం'లో జిల్లాకు మరోసారి అవార్డు

● సీఎం చంద్రబాబు నుంచి పురస్కారం అందుకున్న కలెక్టర్



సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తున్న జిల్లాగా తిరుపతిని గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వరుసగా రెండోసారి అవార్డుకు ఎంపిక చేసింది. విజయవాడ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'బెస్ట్ డిస్ట్రిక్ట్ ప్రమోటింగ్ టూరిజం ఇన్ ఆంధ్రప్రదేశ్' కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎం చంద్రబబు నుంచి అవార్డు అందుకున్నారు. వారసత్వ, ఆధ్యాత్మిక కళలు, కోస్టల్ అగ్రి, స్పేస్ టూరిజం అభివృద్ధికి కలెక్టర్ విశేషమైన కృషి చేశారు. అలాగే ఇంటర్నేషనల్ యోగా డే, కృష్ణవేణి సంగీత నీరాజనం, హర్ గర్ తిరంగా, ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. సీఎంతో పాటు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కలెక్టర్‌ను, జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ప్రభుత్వం, టూరిజం అథారిటీ, స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకుంటూ పర్యాటకులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ చెప్పారు. కాగా, ఉత్తమ రిసార్ట్‌గా మాంగో రిసార్ట్ శ్రీసిటీ, ఉత్తమ స్టార్ హోటల్‌గా మారస సరోవర్, ఉత్తమ చెఫ్‌గా భారతీరాజా తాజ్ హోటల్, ఉత్తమ టూరిస్టు డెస్టినేషన్ అర్బన్, రూరల్‌కు సంబంధించిన తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, బెస్ట్ డిస్ట్రిక్ట్ ప్రమోటింగ్ టూరిజం(కలెక్టర్) జిల్లా కలెక్టర్, బెస్ట్ టూరిజం ఫ్రెండ్లీ ఎయిర్‌పోర్టు తిరుపతి ఎయిర్‌పోర్టు, బెస్ట్ టూరిజం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌గా ఇండియర్ కలినరీ ఇన్‌స్టిట్యూట్(తిరుపతి), ఆర్ట్ అండ్ కల్చర్ కింద శ్రీకాళహస్తికి చెందిన దశరధాచారికి అవార్డులు లభించాయి.

అధికారులూ.. శభాష్

● మహిళా సాధికారత సదస్సు విజయవంతంపై యంత్రాంగానికి స్పీకర్ ప్రశంసలు



తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి వేదికగా ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన మహిళా సాధికారత సదస్సును విజయవంతం చేసిన జిల్లా యంత్రాంగాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశంసించారు. శనివారం అసెంబ్లీ వేదికగా ఆయన అభినందనలు తెలిపారు. సదస్సు ప్రారంభం నుంచి చివరి వరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చక్కటి ఏర్పాట్లతో సదస్సును విజయవంతంచేసి రాష్ట్రానికి మంచిపేరు తీసుకువచ్చారని అధికారులను అభినందించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, కమిషనర్ మౌర్య, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆరణి శ్రీనివాసులు, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డితోపాటు పలువురు ప్రజాప్రతినిధుల సహకారం మరువలేనిదన్నారు.





చెన్నై గొడుగులు వచ్చేశాయ్

తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): చెన్నై గొడుగులు కూడా తిరుమలకు చేరుకున్నాయి. టీటీడీ ఛైర్మన్ బీఆర్‌నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు హిందూ ధర్మార్థ సమితి ట్రస్టీ ఆర్ఆర్ గోపాల్‌జీ వీటిని అందించారు. వరుసగా 21వ సారి శ్రీనివాసునికి గొడుగులను సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, ప్రశాంతి, కృష్ణమూర్తి వైద్యనాథన్ తదితరులు పాల్గొన్నారు.

మాడవీధిలో చిన్నారికి అస్వస్థత



బాలికను ఎత్తుకుని పరుగులు తీస్తున్న భద్రతాసిబ్బంది

తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయ మాడవీధుల్లో శనివారం రాత్రి పదేళ్ల బాలిక తీవ్ర అస్వస్థతకు గురైంది. చిన్నజీయర్ మఠానికి సమీపంలోని గ్యాలరీ నుంచి సర్వభూపాల వాహనసేవను వీక్షిస్తున్న క్రమంలో ఆమె మూర్ఛవ్యాధితో కుప్పకూలిపోయింది. నోటి నుంచి రక్తం రావడంతో బాలిక తల్లిదండ్రులు రోదిస్తూ సమీపంలో భద్రతాసిబ్బంది సాయం కోరారు. వారు వెంటనే బాలికను ఎత్తుకుని వాహనం ఎదురుగా పరుగులు తీశారు. భారీ రద్దీ క్రమంలో గేట్లు తాళం వేయడంతో తిరిగి మ్యూజియం వైపునకు వేగంగా వేసుకున్న అక్కడున్న అంబులెన్స్‌లో అశ్విని ఆస్పత్రికి తరలించారు. మూర్ఛవల్ల నాలుక కొరుక్కోవడంతో నోటి వెంట రక్తం వచ్చిందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం బాలిక కోలుకుంటుంది.

'సర్వభూపాలం'పై స్వామివారు

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో శనివారం రాత్రి జరిగిన సర్వభూపాల వాహనంపై బకాసురవధ అలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామి భక్తులను దర్శనమిచ్చారు. గజరాజులు, అశ్వాలు, భజన బృందాలు, కోలాటాలు, జీయంగార్ల గోష్ఠి ముందు సాగుతుండగా గోవిందుడు తన వైభవాన్ని చూపారు.

ఘటాటోపంలో వాహనసేవ : ఉదయం ఓ మోస్తరుగా ఎండ కనిపించినప్పటికీ ఆ తర్వాత నల్లటి మేఘాలు తిరుమలను కప్పేశాయి. రాత్రి వరకు చల్లటిగాలులు వీయగా, రాత్రి 8.45 గంటల సమయంలో కొద్ది సేపు చిరుజల్లులు కురిశాయి. దీంతో ఉత్సవమూర్తులు తడిచిపోకుండా ఘటాటోపం నీడలో వాహనసేవను నిర్వహించారు. చినుకులు ఆగిపోవడంతో యాదావిధిగా ఘటాటోపాన్ని తొలగించి వాహనసేవను నిర్వహించారు.



మోహినిదేవి అలంకారంలో పార్వతీదేవి



బాలత్రిపురసుందరిగా కన్యకాపరమేశ్వరి



అమ్మవారి చెంతకు పూర్ణాహుతని తీసుకెళ్తున్న ఉభయకర్తలు చిట్టేటి పెరుమాల్ దంపతులు



నాయుడుపేట: అన్నపూర్ణదేవి అలంకరణలో మూకాంబికాదేవి

కరుణించవమ్మా తల్లీ...

సూళ్లూరుపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): శరన్నవ రాత్రి వేడుకల్లో భాగంగా శనివారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి బాలత్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బాపూజీకాలనీ, సోనియాగాంధీ నగర్, కసారెడ్డిపాలెంవాసులు అమ్మవారికి సారె సమర్పించారు. అలంకరణకు శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి, మమత, చండీ యాగానికి చిట్టేటి పెరుమాల్, గోవిందమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అలాగే నాగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు మోహినిదేవిగా, కన్యకాపరమేశ్వరి అమ్మవారు బాలత్రిపుసుందరిగా దర్శనమిచ్చారు.

నాయుడుపేట: పట్టణంలోని మూకాంబికాదేవి, పోలేరమ్మ, మానసాదేవి, కన్యకా పరమేశ్వరి, దుర్గాదేవి, అంకమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూకాంబికా దేవిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు.

గూడూరు: స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయ దుర్గాదేవి ఉపపీఠంలో అమ్మవారిని లలితత్రిపురసుందరీ దేవి అలంకారంలో, బజారుకలిశం వద్ద అమ్మవారిని రాజ రాజేశ్వరిదేవిగా, రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని లలితాదేవిగా, కన్యకాపరమేశ్వరిని గజలక్ష్మీదేవిగా, ధర్మరాజ స్వామి ఆలయంలో ద్రౌపదిదేవిని మధుకైటవవధ అలంకారంలో, నారాయణమ్మ ఆలయంలో అమ్మవారిని గాయత్రి దేవిగా, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని విజయలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మను మహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారిని అర్ధరథంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవిని సంతానలక్ష్మిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని మహాలక్ష్మిగా, మూలవిరాట్‌కు వారాహిదేవి అలంకరణ, కర్ణకమ్మ వీధిలోని కాత్యాయనీదేవికి మీనాక్షీదేవి అలంకారం, వెంకటేశ్వరస్వామికి పరశురామావతారం, మంద నాంచరేశ్వరికి లక్ష్మీదేవిగా అలంకరించారు.

కోట: గ్రామదేవత కోటమ్మను లలితాత్రిపురసుందరిగా, వాసవీ కన్యకాపరమేశ్వరిని అన్నపూర్ణదేవిగా, విద్యానగర్ లోని మహాలక్ష్మిని లలితాదేవిగా, గూడలిలోని చాముండేశ్వరిని లలిత త్రిపురసుందరిగా అలంకరించారు.



అత్రిపురసుందరీదేవిగా విజయదుర్గాదేవి



గాయత్రిదేవిగా నారాయణమ్మ



లలితాదేవిగా రాజరాజేశ్వరీదేవి



మహాలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి



మీనాక్షీదేవిగా కాత్యాయనీదేవి



లలిత త్రిపురసుందరిగా చాముండేశ్వరి



అన్నపూర్ణదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి

అక్రమ కట్టడాలను అడ్డుకున్న అధికారులు

కోట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత మార్కెట్ సెంటర్‌లో కోట్లాది రూపాయలు విలువ చేసే ఇరిగేషన్ భూముల్లో అక్రమ కట్టడాలను శనివారం అధికారులు అడ్డుకున్నారు. పాత మార్కెట్ స్థలంలో ఉన్న దుకాణాలను గత ప్రభుత్వంలో అప్పటి ఆర్డీవో కిరణ్‌కుమార్ ఆక్రమణల పేరుతో తొలగించారు. కొంత మంది ఆ భూమిలో అక్ర మ నిర్మాణం చేపట్టారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు తహసీల్దారు జయజయరావు, ఇరిగేషన్ ఏఈ మునిరత్నం, మండల సర్వేయర్ గోపీరెడ్డి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో రమణయ్య సంఘటనా స్థలానికి చేరుకొని నిర్మాణాన్ని ఆపివేయించారు.

పంచాయతీ విభజనపై గ్రామసభ

బాలాయపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండ లంలోని పెరిమిడి పంచాయతీ పరిధిలో గల మేల్చూరు, సీసీ కండ్రిగ గ్రామాలను పంచాయతీగా చేయాలన్న స్థానికుల వినతి మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో శనివారం సర్పంచ్ పూడేటి వనమ్మ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి అర్మగం గ్రామసభ నిర్వహించారు. ప్రజల అభిప్రాయాలను కోరుతూ ఓటింగ్ నిర్వహించగా వార్డు సభ్యులతో పాటు గ్రామసభకు హాజరైన స్థానికులందరూ అంగీకారం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లబోతుల మురళి, రాపూరు శ్రీనివాసులు, కాసరం పెద్దశ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

14 వరకు ఆందోళనలు... ఆపై సమ్మె



సీఎండీకి సమ్మె నోటీసు ఇస్తున్న విద్యుత్ జేఏసీ నాయకులు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జేఏసీ నాయకుల పిలుపు మేరకు తిరుపతి సర్కిల్ జేఏసీ నాయకులు శనివారం సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావుకు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు దేవేంద్రరెడ్డి, ఎల్.చలపతి, మురళీధర్‌లు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యం అంగీకరించిన సమస్యలు, ప్రస్తుతం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఫలితంగా ఈ నెలలో వారం రోజులు ఆందోళనలు చేశామన్నారు. రెండవ దశ ఆందోళనలో భాగంగా అక్టోబరు 6నుంచి 14వరకు దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తామని, ఆపై నిరవధిక సమ్మె చేయడానికి రాష్ట్ర జేఏసీ నిర్ణయించిందని సీఎండీకి వివరించారు. కార్యక్రమంలో నాయకులు వి.గోపి, జి.ఏలుమలై, ఐ.సుబ్రమణ్యం, పి.షణ్ముగం, ఎ.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాల కట్టడికి పోలీసుల ప్రణాళిక

తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): గరుడ వాహనసేవలో భక్తులను దొంగలబారిని పడనీయకుండా ప్రత్యేకంగా పోలీసు బృందాలను నియమించారు. వీరు సివిల్ డ్రెస్‌లో భక్తుల మధ్య ఉంటారు. భక్తుల్లానే ఉంటూ అనుమానితులపై కన్నువేస్తారు. తేడా వస్తే వెంటనే అదుపులోకి తీసుకుంటారు.

తిరుమల సిబ్బందికి వస్త్ర బహుమానం

తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్న అర్చకులు, వేదపారాయణదారులు, ఇతర సిబ్బంది, పోటు సిబ్బంది, వాహన బేరర్లు, కల్యాణకట్ట క్షురకులకు శనివారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు వస్త్రబహుమానం అందించారు. వైభోత్సవం మండపంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు చేతులు మీదుగా ఈ వస్త్రాలను అందజేశారు.

తిరుపతిలోనూ క్రౌడ్ మేనేజ్ మెంటు సిస్టమ్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం జరిగే శ్రీవారి గరుడ సేవకు శనివారం రాత్రికే రద్దీ పెరిగింది. దీని ప్రభావం తిరుపతిలోనూ కనిపిస్తోంది. దీంతో నగరంలోనూ క్రౌడ్ మేనేజ్ సిస్టమ్ నిర్వహిస్తున్నారు. శనివారం నాటికే తిరుపతి ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్, భారతి బస్టాండు, అన్ని రోడ్లలో భక్తులు కిక్కిరిశారు. తమిళనాడు నుంచి స్వామి మాల ధరించిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. దీంతో ఎస్పీ సుబ్బరాయుడు ముందస్తుగా ట్రాఫిక్ నియంత్రణతో పాటు క్రౌడ్ మేనేజ్‌మెంటు కోసం భారీ ఎత్తున పోలీసులను నియమించారు. ఇందులో భాగంగా భక్తులకు, వాహనదారులకు అవసరమైన సలహాలు, సూచనలను ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేంద్ర మైకు అందిస్తూ వచ్చారు. ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఫ్లైఓవర్ డౌన్ రోడ్డుతో పాటు భక్తులు అధిక సంఖ్యలో తిరుమలకు వెళ్లే రోడ్లపై పోలీసులు మోహరించారు.

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ, శిలాతోరణం, బాట గంగమ్మ సర్కిల్ మీదుగా ఆక్టోపస్ భవనం వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి: పాశిం



సీఎం చంద్రబాబుకు సమస్యలను విన్నవిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కోరారు. శనివారం సచివాలయంలో సీఎంను కలిసిన ఎమ్మెల్యే గత టీడీపీ హయాంలో పంబలేరు వంతెన నిర్మాణం ప్రారంభిస్తే వైసీపీ ప్రభుత్వం అసంపూర్తిగా నిలిపివేసిందన్నారు. రూ.9 కోట్లు మంజూరు చేయించి వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వాకాడు, కోట మండలాల ప్రజల సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు కండలేరు డ్యామ్‌నుంచి 2 టీఎంసీల నీటిని స్వర్ణముఖి బ్యారేజీకి విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు.

చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి వెంకటనాగపవన్

గూడూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకట నాగపవన్ అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, పేదరిక నిర్మూలన గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు రాజేష్, బీవీ. సులోచనారాణి, న్యాయవాదులు, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కన్యకా పరమేశ్వరి అమ్మవారిని విజయలక్ష్మీ దేవిగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు గ్రామోత్సవం సాగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు: బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బంగారంపేట సచివాలయంలో నిర్వహించిన స్వస్థ్‌నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో నిత్యావసర సరుకులతో పాటు దుస్తులు, మందులు, కిరాణా సామగ్రి, వ్యవసాయ పరికరాలు, ఆటో మొబైల్స్ తదితర 375 రకాల వస్తువుల ధరలు తగ్గుతాయన్నారు. దీంతో ప్రజల కొనుగోలు శక్తి పెరగడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుటుందన్నారు. జీఎస్టీ సంస్కరణలతో కలిగే లాభాలు ప్రతి కుటుంబానికి చేరేందుకు ఈనెల 22నుంచి వచ్చే నెల 25 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ నేత, బంగారంపేట సర్పంచు దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దొమ్మరాజు సత్యనారాయణరాజు, గుంటపూడి గురవయ్య, గోగుతోటి మురళి, సకిలాల సునీల్ తదితరులు పాల్గొన్నారు.



2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ ప్రసాదరావు

ఉత్సాహంగా 2కే రన్

చిత్తూరు క్రీడలు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా చిత్తూరులో శనివారం నిర్వహించిన 2కే రన్ ఉత్సాహంగా సాగింది. గాంధీ విగ్రహం వద్ద 2కే రన్‌ను ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ప్రారంభించారు. అనంతరం మెసానికల్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. పర్యాటక రంగం అభివృద్ధికి సీఎం చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. పర్యాటక రంగంలో జిల్లాను అభివృద్ధి చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. 2కే రన్, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. క్రీడా, పర్యాటక శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాడిపరిశ్రమ రంగంలో ఉద్యోగావకాశాలు మెండు

తిరుపతిరూరల్, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): డెయిరీ టెక్నాలజీ కోర్సు విద్యార్థులకు పాడి పరిశ్రమలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని పలువురు పూర్వవిద్యార్థులు పేర్కొన్నారు. ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని డెయిరీటెక్నాలజీ కళాశాలలో 2025-26లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు దీక్షారంభం పేరిట 15రోజుల ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం పూర్వవిద్యార్థులతో ఆన్‌లైన్‌లో పరస్పర పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీన్ ప్రొఫెసర్ కె.నాగేశ్వరరావు, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ గంగరాజు, ఓఎస్‌పి డాక్టర్ జీఎస్ స్ఫూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా డీఎస్సీ విజేతలకు సన్మానం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని కచ్చపి ఆడిటోరియంలో సోమవారం మెగా డీఎస్సీ విజేతలను సన్మానిస్తున్నట్లు నారాయణ డీఎస్సీ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు శనివారం వడ్ల జగదీష్, రఘునాథ్‌సింగ్, సతీష్ శనివారం తెలిపారు.

ఇంటిపై దాడులు పోలీసులకు పిర్యాదు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన సప్తగిరి కాలనీ పంచాయతీలో ఓ ఇంటిపై కొంత మంది శనివారం దాడి చేశారు. కూలి పనిచేసుకోవడానికి నగరానికి వచ్చిన ఆ ఇంట్లో నివాసముండే షక్రుమ మొహిద్దీన్ మధ్యాహ్నం తిరిగి వచ్చేటప్పటికి ఇళ్లు ధ్వంసమైయుంది. వెంటనే ఆమె పోలీసులకు సమాచారమివ్వగా, వారు అక్కడకు వచ్చి విచారించారు. తాను నివాసముంటున్న ఇంటికి కొంతకాలంగా ఇదే గ్రామానికి చెందిన చిట్టెమ్మ తప్పుడు పత్రాలు సృష్టించి, ఈ ఇల్లు నాదేనని.. ఖాళీ చేయమని దౌర్జన్యం చేస్తోందని, అనుచరులతో కలసి ఈ దారుణానికి దిగారని షక్రుమ మొహిద్దీన్ ఫిర్యాదుచేశారు. వారి బెదిరింపులను భరించలేక కోర్టును ఆశ్రయించానని, విచారణ జరుగుతోందని, అయినా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు.



ఆర్‌వోబీ నిర్మాణం పూర్తి చేయాలి



గూడూరు పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ఆర్‌వోబీని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సహకరించాలి. ఒకటో, రెండో పట్టణాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా రైల్వే ట్రాక్‌పై ఆర్‌వోబీ నిర్మాణం 14 ఏళ్ల క్రితం ప్రారంభమైంది. పనులు పూర్తి కాకుండా అసంపూర్తిగా నిలిచి పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌వోబీ పూర్తయితే పట్టణవాసులతో పాటు గ్రామీణ ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

- శాసనసభలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరును జిల్లాగా ప్రకటించాలి



గూడూరును జిల్లాగా ప్రకటించాలి. జిల్లాగా కేంద్రంగా ప్రకటించేందుకు అవసరమైన అన్ని వనరులు పట్టణంలో ఉన్నాయి. జిల్లాగా ఏర్పాటు చేయలేని పక్షంలో గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేలా చర్యలు తీసుకోవాలి.

- శాసన మండలిలో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి

కాళంగి నదిపై వంతెనను పునర్నిర్మించాలి



సూళ్లూరుపేట పట్టణంలో చెంగాళమ్మ ఆలయానికి సమీపంలో ఉన్న కాళంగినదిపై వంతెనను పునర్నిర్మించాల్సిన అవసరం ఉంది. 1930లో నిర్మించిన ఈ వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అటు శ్రీహరికోట, ఇటు పులికాట్ సరస్సుకు ఈ వంతెనపైనే వెళ్లాల్సి ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు నాలుగు నెలల ముందు హడావుడిగా వంతెన నిర్మాణానికి అనుమతివ్వడంతో పాటు నిధులను కేటాయిస్తున్నట్లుగా ప్రకటించి చేతులు దులుపుకుంది. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి వంతెనను పునర్నిర్మించాలి

- శాసనసభలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

15న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ క్విజ్ పోటీలు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వివేకానంద జయంతిని పురస్కరించుకొని నిర్వహించే జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా అక్టోబరు 15న ఆన్‌లైన్‌లో వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ క్విజ్‌పోటీలు జరుపుతామని సెట్విన్ సీఈవో డాక్టర్ పి.యశ్వంత్ పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన యువతీ యువకులు న్యూఢిల్లీలో జనవరి 12న నిర్వహించే యువజనోత్సవాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. దీంతో పాటు ప్రధాని, కేంద్ర మంత్రులు, సీనియర్ అధికారులు, ఇతర నాయకుల సమక్షంలో ప్రత్యక్షంగా తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఆసక్తిగల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9849913063 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

కల్యాణ వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి



ఆలయ ఆవరణలో దీపారాధన చేస్తున్న మహిళలు

చంద్రగిరి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించాక ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం చేశారు. పెరటాసి నెల రెండవ శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు దీపారాధన చేశారు.సాయంత్రం ఉత్సవర్లను మాడ వీధుల్లో ఊరేగించారు.

శిల్పారామంలో దసరా సంబరాల ప్రారంభం



నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) శిల్పారామంలో శనివారం దసరా సంబరాలను నిర్వహించారు. తొలిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నందనపల్లికి చెందిన శివాలయ నాట్యశాలకు చెందిన కళాకారులు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. జిల్లా పార్యటకశాఖ, సాంస్కృతికశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి ప్రశంసాపత్రాలు అందజేశారు. శిల్పారామం ఏవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కల్పవృక్షవాహనంపై కల్యాణ వెంకన్న



తిరుపతిరూరల్, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాజమన్నార్ అలంకారంలో కల్పవృక్షవాహనంపై, రాత్రి సర్వభూపాల వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. ఆదివారం రాత్రి జరిగే గరుడోత్సవసేవ నిర్వహణ, ఏర్పాట్లపై తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమావేశం నిర్వహించారు.

తిరుమల పాదయాత్రలో విషాదం: ట్రాక్టర్ కిందపడి మేస్త్రి మృతి



మృతిచెందిన చలపతి

కల్లూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు పాదయాత్రగా వెళుతూ ట్రాక్టర్ కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పులిచెర్ల మండలం కల్లూరులో సోమవారం జరిగింది. మండలంలోని పాతపేటకు చెందిన చలపతి (36) మేస్త్రి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి 13 ఏళ్ల క్రితం మతుకువారిపల్లికి చెందిన సుదర్శినితో వివాహమైంది. వివాహమైన కొన్నాళ్లకే తన భార్య పుట్టినిల్లు అయిన మతుకువారిపల్లిలో కాపురంపెట్టాడు. శనివారం ఉదయం గ్రామానికి చెందిన సుమారు 50 మందితో కలిసి తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ పాదయాత్రలో యాత్రికులకు భోజనం, తాగునీరు తదితర వస్తువులతో వీరివెంట ఓ ట్రాక్టర్ బయలుదేరింది. ఈ ట్రాక్టర్ ఇంజన్‌పై చలపతి కూర్చొని వెళుతుండగా కల్లూరు వద్ద చలపతి ట్రాక్టర్ ఇంజన్‌పై నుంచి ప్రమాదవశాత్తు టైరు కింద జారిపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడు చలపతిని పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తుండగా ఆస్పత్రిలోనే మృతిచెందాడు. పోలీసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో ఆనంద్ తెలిపారు.

పంటలపై ఏనుగుల దాడులు





ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట - ధ్వంసమైన టమోటా పంట దృశ్యం

కల్లూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. దేవళంపేట పంచాయతీలో శుక్రవారం రాత్రి వరి, కొబ్బరి, టమోటా, మామిడిచెట్లపై ఏనుగుల గుంపు దాడులు చేయడంతో అపారనష్టం వాటిల్లింది. శుక్రవారం రాత్రి తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బయలుదేరిన 9 ఏనుగుల గుంపు హంద్రీ-నీవా కాలువ దాటుకొని దిగుమూర్తివారిపల్లి వద్దకు చేరుకున్నాయి. అక్కడ ఘీంకారాలు చేసిన ఏనుగుల గుంపు నాయనిచెరువు మార్గంలో మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ మిట్టమీదరాచపల్లి వద్దకు చేరుకున్నాయి. రైతులు బసవయ్య, భాస్కర్, ప్రభాకర్‌కు చెందిన వరి, టమోటా, పశుగ్రాసాన్ని ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి కల్లూరు-పులిచెర్ల రోడ్డును దాటుకున్న ఏనుగుల గుంపు రైతులు కృష్ణారెడ్డి జగ్మోహన్‌రెడ్డికి చెందిన వరి, మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. చిన్ననగరి మార్గంలో దేవళంపేట వద్దకు చేరుకొని సుధాకర్, ప్రభాకర్‌కు చెందిన వరి, పశుగ్రాసాన్ని ధ్వంసం చేసిన ఏనుగులు అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. దిగుమూర్తివారిపల్లి మీదుగా రైతులు చెంగల్రాయులు, శంకర్‌కు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ అడవిలోకి వెళ్లాయి. శనివారం పగలంతా అడవిలోని సూరప్పచెరువు వద్ద ఏనుగులు గుంపు తిష్టవేసినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ముక్కంటి సేవలో ప్రముఖులు



జస్టిస్ ఎన్వీ రమణకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి రాజేంద్ర శుక్ల దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

జస్టిస్ ఎన్వీ రమణకు సత్కారం

శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దర్శనానికి విచ్చేసిన సుప్రీంకోర్టు మాజీ సీజే జస్టిస్ ఎన్వీ వెంకటరమణ, సతీమణి ఎన్వీ శివమాలను ఎంజీఎం గ్రూప్ ఛైర్మన్ గుడ్లూరు మల్లికార్జునాయుడు, డైరెక్టర్ మయూర్ ఘనంగా సత్కరించారు.

మహిళలకు వైద్య పరీక్షలు



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు తదితరులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో శనివారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభి యాన్ కార్యక్రమంలో భాగా మెగా వైద్య శిబిరం నిర్వహించారు. స్త్రీల ఆరోగ్యంపై అవగాహన, గర్భిణులకు పలు పరీక్షలు, మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్, రక్తహీనత స్క్రీనింగ్ వంటి పరీక్షలు నిర్వహించారు. ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, అసిస్టెంట్ మెడికల్ సూపరిం టెండెంట్ మణి, వైద్యులు విజయలక్ష్మి, శ్రీదేవి, మునిశ్రావణి, నర్సింగ్ సూపరింటెండెంట్ రత్నకుమారి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రమేష్, వినయ్, సుమతి, అంగన్వాడీ కార్య కర్తలు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఐను సన్మానించిన విజయకుమార్



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఐ విశ్వనాథనాయుడు ఈ నెల 30న పదవీ విరమణ చేయ నున్నారు. దీంతో శ్రీకాళహస్తి టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం ఆయన్ను ఘనంగా సన్మానించారు.

దుర్గ అలంకరణలో మరగదాంబిక



నాగలాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పల్లికొండేశ్వర ఆల యంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మరగదాంబిక అమ్మవారు దుర్గ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండపంలో మరగదాంబిక అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం చేశారు. పట్టు వస్త్రాలతో, బంగారు ఆభరణాలతో అలంకరించి ఊంజల్‌సేవ నిర్వహించారు. ఈవో లత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వడ్డీ వ్యాపారి దౌర్జన్యం

- వృద్ధురాలి ఇంటికి తాళం
- మూడు రోజులుగా ఇంటిబయటే
- నాగలాపురంలో దారుణం

నాగలాపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అప్పు చెల్లించలేదని నాగలా పురంలో వడ్డీ వ్యాపారి వృద్ధురాలిపై దౌర్జన్యానికి దిగాడు. ఆమెను ఇంటినుంచి గెంటేసి ఇంటికి తాళం వేశాడు. మూడు రోజుల క్రితం చోటు చేసుకున్న ఈ ఘటన శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితురాలి కథనం మేరకు.. నాగలాపురం గాంధీ వీధికి చెందిన సయ్యద్‌బాబు భార్య జైనాబీ పట్టణానికి చెందిన వడ్డీ వ్యాపారి జగదీష్ వద్ద వడ్డీకి అప్పు తీసుకుంది. బాండు పత్రాలు రాసి ఇచ్చింది. తర్వాత కంతులవారీగా అప్పు చెల్లించింది. అనంతరం బాండు పత్రాలు ఇవ్వాలని కోరగా ఇంకా అప్పు తీరలేదని దౌర్జన్యం చేశాడు. ఇంటినుంచి ఆమెను గెంటేసి తాళం వేశాడు. విద్యుత్ కనెక్షన్‌ను కట్ చేశాడు. అప్పు కింద ఇల్లు జమ చేసుకుంటున్నానని, ఇక్కడే ఉంటే మనుషులతో కొట్టి చంపేస్తానని, ఇల్లు నుంచి వెళ్లాలంటూ జగదీష్ బెదిరించాడు. ఇంటికి తాళం వేయడంతో మూడు రోజులుగా ఇంటిబయటే గడుపుతున్నానని ఆమె కన్నీటి పర్యంత మైంది. దీనిపై పోలీసులకు పిర్యాదు చేసింది. కాగా దీనిపై ఎస్‌ఐని వివరణ కోరగా ఈ ఘటనపై విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



కాలువలో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య కార్మికులు

పిచ్చాటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్ర మత్తంగా వ్యవహరించాలని ముడియూరు పంచాయతీ కార్యదర్శి కుమార్ తెలిపారు. శనివారం పంచాయతీలోని అద్దాలమేడ గ్రామంలో పారిశుధ్య కార్మికులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పర్యటించారు. పారిశుధ్య చర్యలలో భాగంగా మందులను పిచికారి చేయించారు. మురుగు కాలువల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గ్రామంలో కొన్ని రోజులుగా పలువురు జ్వరాల బారిన పడడంతో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి రక్తనమూనాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుమార్, డిజిటల్ అసిస్టెంట్ రాజేంద్ర, ఏఎన్ఎం హిమశ్రీ, సిబ్బంది నళిని, గురవమ్మ, రోహిణి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరుడికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువైన శనీశ్వర స్వామికి శనివారం వేదోక్తంగా పూ జలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం పలు పుష్పాలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌కు ఫాతిమా



ఏర్పేడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో గుంటూరులో శనివారం జరిగిన సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ మీట్‌లో ఏర్పేడుకు చెందిన ఫాతిమా పాల్గొన్నారు. కోచ్ శివకుమార్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాబట్, అధ్యక్షుడు గిరిజధర్ రాజు మాట్లాడుతూ జాతీయస్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సిద్ధార్థలో ఘనంగా విజయదశమి వేడుకలు



పూజలు చేస్తున్న అశోక్‌రాజు దంపతులు

నారాయణవనం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ ఇంజనీరంగ్ కళాశాలలో శనివారం విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ అశోక్‌రాజు, వైస్ ఛైర్మన్ ఇందిరవేణి, అధ్యాపకులు, విద్యార్థులు సరస్వతి పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు, కోలా టాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ జనార్ధనరాజు, మధు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కామాక్షిగా గంగమ్మ



పిచ్చాటూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రజానగరం గ్రామదేవత గంగమ్మ తల్లి శనివారం శరన్నవరాత్రి ఉత్సవంలో భాగంగా 7వ రోజు కామాక్షిదేవి అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బొమ్మల కొలువు



బొమ్మల కొలువు అనేది భక్తి, కళ, సంస్కృతి, సామాజికత, ఆధ్యాత్మిక కలగలసిన ఒక మహోన్నత మైన సంప్రదాయమని పట్టణానికి చెందిన లోకేష్ గురుకుల; కమల హాసన్ గురుకుల్ అన్నారు. దసరా ను పురస్కరించుకుని శ్రీరామ్‌నగర్ కాలనీలో గల తమ నివాసంలో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంటోంది.

\- శ్రీకాళహస్తి

మహాలక్ష్మీ దేవిగా సర్వమంగళాదేవి



సత్యవేడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణ వీరభద్ర స్వామి ఆలయంలో విజయదశమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సర్వమంగళా దేవి అమ్మవారు ఆరవ రోజైన శనివారం లలితా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ పుష్పాలతోఅందంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త ఇందూరి రవికుమార్ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి పూజాభిషేకాలు నిర్వహించి, మహాహారతి చేపట్టారు. మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ● ఇరుగుళంలోని ఉమామహేశ్వరి ఆలయంలో ఆలయ ధర్మకర్త ఎంపీపీ సుశీల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగగా కొనసాగుతున్నాయి. ఆరవ రోజు అమ్మవారు లలితా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

లలితా త్రిపుర సుందరిగా చెంగాళమ్మ



వరదయ్యపాళెం: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు లలితా త్రిపుర సుందరిగా భక్తులను కటాక్షించారు. ● అంబూరులోని కామాక్షమ్మ ఆలయంలో అమ్మవారు లలితా దేవిగా దర్శనమిచ్చారు.

మీనాక్షి దేవి అలంకరణలో అవనాక్షమ్మ



మీనాక్షి దేవి అలంకరణలో అవనాక్షమ్మ, దుర్గాదేవిగా కామాక్షిదేవి

నారాయణవనం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సముదాయం గ్రామంలో కొలువైన టీటీడీ అనుబంధ ఆలయమైన అవనాక్షమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారిని మీనాక్షిదేవి అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం అమ్మవారికి నిత్య పూజా కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు మీనాక్షిదేవి గా అలంకరించి ఊంజలసేవ జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు. ● కైలాసనాథ కోనలోని కామాక్షి అమ్మవారు దుర్గాదేవి దేవిగా దర్శనమిచ్చారు.

ఆదేశాలు వచ్చే వరకు మైనింగ్ చేపట్టరాదు



బ్రాహ్మణపల్లి వద్ద పొలాలను పరిశీలిస్తున్న మైనింగ్ జోనల్ అధికారులు

కేవీబీపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందేవరకు వీజే కంపెనీ మైనింగ్ పనులు చేపట్టరాదని మైనింగ్ జోనల్ అధికారులు మునిప్రసాద్, జ్యోతి మనోహర్ ఆదేశించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి పరిసర గ్రామాల్లో వీజే కంపెనీ చేపట్టిన మైనింగ్ పనులతో పొలాలు, చెరువుల్లో నీరు కలుషితమవుతోందని రైతు సురేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు రాష్ట్ర మైనింగ్ ఛైర్మన్ వెంకటకృష్ణయ్యకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన స్థానిక పరిస్థితులను పరిశీలించి నివేదిక ఇవ్వాలని తిరుపతి జోనల్ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు వారు శనివారం బ్రాహ్మణపల్లి కొండపై నుంచి పొలా లను పరిశీలించారు. పలు వీడియోలు తీసుకున్నారు. గ్రామ స్తులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నివేదిక అధికారులకు అందజేస్తామని వారి నుంచి ఆదేశాలు వచ్చే వరకు పనులు చేపట్టరాదని స్పష్టం చేశారు.

జీఎస్టీ తగ్గింపు ఫలాలు ప్రజలకు అందాలి

వరదయ్యపాళెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో పలు నిత్యావసర సరుకులపై వస్తు సేవల పన్ను తగ్గిందని సేల్స్ టాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ మురళీకృష్ణ తెలియజేశారు. శనివారం వరదయ్యపాళెంలో వ్యాపారులకు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గిన తరువాత వినియోగదారుడు పొందుతున్న లాభంపై దుకాణం ముందు పాత, కొత్త ధరలతో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మేరకు సూపర్ మార్కెట్, ప్రొవిజన్స్ స్టోర్, కిరాణా కొట్టు యజమానులు పాతస్టాక్ పేరుతో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ సర్కిల్ ఎక్స్‌క్లూజివ్ టాక్స్ అదికారులు ఎం.సతీష్, వెంకటముని పాల్గొన్నారు.

ఎరువుల విక్రయ వివరాలు అందించాలి

సత్యవేడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎరువుల విక్రయ వివరాలను విధిగా కార్యాలయలో అందించాలని వ్యవసాయశాఖ ఏవో మురళి దుకాణదారులకు సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం మండలంలోని ఎరువుల దుకాణదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి పట్టాదార్ పుస్తకం, ఆధార్ తదితర ధృవ పత్రాల నకలు తీసుకుని ఎరువులను విక్రయించాలని సూచించారు. యూరియా అవసరం మేరకే పంపిణీ చేయాలన్నారు. అవకతవకలకు పాల్పడితే లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు.

డిప్లొమా విద్యార్థిపై దాడి ఆరుగురిపై కేసు

నారాయణవనం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు సమీపంలోని ఒక ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్ గదిలో ఒక విద్యార్థిని విచక్షణారహితంగా కొడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ కాలేజీలో డిప్లొమోలో చేరిన అన్నమయ్య జిల్లా బొగ్గులవారి పల్లి గ్రామానికి చెందిన బాల నరసింహను హాస్టల్ గదిలో అదేకాలేజీ విద్యార్థులు ఆరుగురు దారుణంగా కొడుతున్న దృశ్యాలు ఇందులో ఉన్నాయి. గాయపడ్డ విద్యార్థికి పుత్తూరు, తిరుపతిల్లో చికిత్స చేయించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ దాడిపై నరసింహ ఫిర్యాదు మేరకు నారాయణవనం పోలీస్ స్టేషన్‌లో ఆరుగురు విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

ఘనంగా అంకాళమ్మ జాతర

బుచ్చినాయుడుకండ్రిగ: ఆర్ అనంతపురం గ్రామంలో కొలువైన అంకాళమ్మ పరమేశ్వరి జాతరను శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో అమ్మవారు గెరిగెల ఊరే గింపు కోలాహలంగా సాగింది. మహిళలు భక్తి శ్రద్ధతో పొంగళ్లుపెట్టారు.

పుత్తూరు వార్తలు

పార్వతీదేవిగా ద్రౌపదీ దేవి దర్శనం



పార్వతీదేవిగా ద్రౌపది దేవి అమ్మవారు, వారాహి అమ్మవారి అలంకరణలో కామాక్షమ్మ, గజలక్ష్మిగా నాగాలమ్మ

పుత్తూరు టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం పుత్తూరులోని ద్రౌపది దేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో అమ్మవారు పార్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ క్రిష్టప్ప మెదలి, మాజీ ఛైర్మన్ యుగంధర్, సభ్యులు మునిచంద్ర, దామోదరం, పురోహితులు మోహన్ తదితరులు పాల్గొన్నారు. ● సదాశివేశ్వరస్వామి ఆలయంలో కామాక్షమ్మవారు వారాహి అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ దిలీప్, ఈవో విజయకృష్ణ, సభ్యులు పార్తీబన్, శ్రీధర్, పూజిత, చిలకమ్మ పాల్గొన్నారు. ● రైల్వే క్వార్టర్స్‌లో కొలువైన నాగాలమ్మ గజలక్ష్మీదేవిగా భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఎబ్బారు సూర్యనారాయణ పాల్గొన్నారు. ● పుత్తూరు మండల పరిధిలోని రాచపాలెంలో ఉన్న శ్రీ లక్ష్మీ కనకదుర్గమ్మ లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

వడమాలపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌బీఆర్ పురం గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మణిరాజు తెలిపారు. అమెరికాకు చెందిన 'ఆడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్' ఫౌండర్ భూపతి రాజు ఆధ్వర్యంలో గ్రామంలోని ఎంపీపీ పాఠశాల వద్ద ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని పరిసరాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కామాక్షిదేవిగా కన్యకాంబ



కామాక్షిదేవి అలంకారంలో వాసవీదేవి

వడమాలపేట,సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం కామాక్షిదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి దర్శనమిచ్చారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉదయం పంచామృత అభిషేకం చేశారు. సాయంత్రం మహిళలు లలితా సహస్ర నామాచార్చనలతో కుంకుమ పూజలు చేశారు. రాత్రి అమ్మవారిని బాలా త్రిపురసుందరి రూపంలో పూలమాలలు, ఆభరణాలతో అలంకరించారు. పురోహితులు ప్రసాద్ శర్మ భక్తులకు తీర్థప్రాసదాలు అందజేశారు. ● స్థానిక అంకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

రేపు మున్సిపల్ సమావేశం

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 29 ఉదయం 11 గంటలకు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వైస్ ఛైర్మన్లు, వార్డు సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

గోవిందనామాలతో పులకించిన అప్పలాయగుంట



అప్పలాయగుంటలో మాడవీధుల్లో స్వామివారి ఊరేగింపు

వడమాలపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రసన్న వెంకటేశ్వరస్వామి వెలిసిన అప్పలాయగుంట భక్తుల గోవింద నామస్మరణలతో పులకించింది. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు పాదయాత్రగా వెళ్లే తమిళనాడుకు చెందిన గోవిందభక్తులు వేలాదిగా స్వామిని దర్శించారు. పెరటాసి నెల రెండవ శనివారం కావడంతో భక్తులు విశేషంగా తరలివచ్చారు. అభయహస్తాదీసుడైన ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారికి పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు చెల్లించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరుడిని సర్వాంగ సుందరంగా ఊయలలో అలంకరింపజేసి భక్తుల గోవిందనామ స్మరణల నడుమ ఊంజల సేవ కనుల పండువగా నిర్వహించారు. అనంతరం పద్మావతీ, ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వరుని మేళతాలాలతో మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ శ్రీవాణి, ఆలయ అధికారి వేణుగోపాల్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.